ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 85 | బుధవారం 26-03-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

# ఉగాదికి కొత్త మంత్రులు!

## పండుగ రోజు ప్రమాణ స్వీకారం!.. నలుగురు లేదా ఐదుగురికి అవకాశం


- ఎస్సీ, బీసీ, రెడ్డి, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి క్యాబినెట్ విస్తరణలో చోటు
- రాజగోపాల్‌రెడ్డికి స్థానంపై తర్జన భర్జన
- బీసీల్లో తెరపైకి మున్నూరుకాపు సామాజికవర్గం
- ఎస్సీల్లో వివేక్ వెంకటస్వామికే అవకాశం
- మైనారిటీల్లో ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్‌కు చాన్స్!
- ఒకట్రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్న అధిష్ఠానం
- నాకు చాన్స్ వస్తుందనుకుంటున్నా: రాజగోపాల్



**తొలి సమయం హైదరాబాద్, మార్చి 25:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గర పడింది. ఉగాది పండుగ రోజున.. కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విస్తరణలోనూ పూర్తిస్థాయి మంత్రిమండలి ఏర్పడే అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి సహా 12 మంది ఉన్న విషయం తెలిసిందే. పూర్తిస్థాయి క్యాబినెట్లోకి మరో ఆరుగురిని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే సామాజిక, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. ఈ విస్తరణలో ఒకటి, లేదా రెండు బెర్తులను పెండింగ్‌లో పెట్టనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. క్యాబినెట్ విస్తరణలో ఎవరికి అవకాశం దక్కనుందనే విషయంపై అధిష్ఠానం ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనుంది. ఉగాది వరకు మంచి రోజులు లేవని, ఈ నేపథ్యంలో ఉగాది రోజు కొత్త మంత్రులు ప్రమాణం చేయనున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆ రోజు కుదరని పక్షంలో.. తర్వాతి రోజు ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతున్నాయి. కాగా, మంత్రివర్గ విస్తరణలో ఓసీ(రెడ్డి), బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు ఒక్కో బెర్తును కేటాయించాలని సోమవారం ఢిల్లీలో అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జరిపిన చర్చల్లో ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎస్సీకి సంబంధించి మాల సామాజికవర్గానికి చెందిన గడ్డం వివేక్ వెంకటస్వామి పేరే దాదాపు ఖరారైనట్లు చెబుతున్నారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు మంత్రివర్గంలో చోటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివేక్ వెంకటస్వామికి చోటు కల్పిస్తే ఎదురయ్యే పరిణామాలనూ అంచనా వేస్తున్నారు. బీసీల నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరి పేరు ఖరారైనట్లేనని ఇప్పటిదాకా ప్రచారంలో ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. రాష్ట్ర క్యాబినెట్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చోటు కల్పిస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ నేపథ్యంలో.. ఆ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి క్యాబినెట్లో చోటు గ్యారెంటీ అన్న ప్రచారం జరిగింది. అయితే మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న మున్నూరుకాపు సామాజికవర్గాన్ని దగ్గర చేసుకునేందుకు.. ఆ సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాసను మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న చర్చ సోమవారం నాటి సమావేశంలో జరిగినట్లు తెలుస్తోంది. అప్పుడు వాకిటి శ్రీహరికి క్యాబినెట్ హోదాతో విప్ బాధ్యతలు ఇవ్వాలన్న దానిపై చర్చించారు. ఈ రెండు అంశాలూ ప్రస్తుతం అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక ముస్లిం సామాజిక వర్గానికి సంబంధించి మంత్రివర్గంలోకి తీసుకోవడానికి ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్ ఒక్కరే చట్టసభల్లో అందుబాటులో ఉన్నారు. ఈ వర్గం నుంచి ఆయనకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఇదికాకుండా.. ముస్లింల నుంచి పార్టీ సీనియర్ నేత ఎవరినైనా క్యాబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత ఎమ్మెల్సీని చేసే అంశాన్నీ పరిశీలించినట్లు సమాచారం.

# విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం

- రిక్రూట్‌మెంట్లు పెరిగినా..డ్రాపౌట్స్ పెరగడమేమిటి
- ప్రభుత్వ తీరును నిలదీసిన బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి
- తమ హయాంలో విద్యావ్యవస్థను పటిష్టం చేశామన్న హరీష్ రావు



**తొలి సమయం హైదరాబాద్,మార్చి25:** టీచర్ల రిక్రూట్‌మెంట్ జరిగినా.. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ పెరగడం ఏమిటని తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ పద్దులుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా వాడీవేడి చర్చ సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 26 వేల మందిని మాత్రమే రిక్రూట్ చేసిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే క్రెడిట్ తీసుకుంటుందని రాకేశ్ రెడ్డి విమర్శించారు. అంతమందిని రిక్రూట్ చేశారని చెబుతున్నారు. కానీ గతంలో ఒక్కటే కాలేజీ ఉండేది. ఇప్పుడు 100కు పెరిగాయి. కానీ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలు ఇంకా గణనీయంగా అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు. ఆయన తన ప్రసంగంలో విద్యా వ్యవస్థలో ఏర్పడిన లోపాలను ఎత్తిచూపారు. పదేళ్లలో 6,000 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని, గత ఏడాది లోపలే 1,800 స్కూళ్లు మూతపడిన విషయం గమనార్హమని చెప్పారు. అప్పుడు బంగారు తెలంగాణ అని చెప్పారు, ఇప్పుడు వజ్రాల తెలంగాణ అంటున్నారు. కానీ విద్యా రంగం మాత్రం దిగజారిపోతోంది. 1931 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉన్నాయి. ఇన్ని వేల కోట్ల బడ్జెట్ పెట్టినా పరిస్థితి మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. స్కూళ్లలో ఒకటే బాత్రూం ఉంటుంది, అక్కడ పందులు తిరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఎలా ప్రభుత్వ స్కూళ్లలో చదవగలరని అన్నారు. తల్లిదండ్రులు అప్పు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉంది. కానీ సీఎం దగ్గర చాలా పనులు ఉంటాయి. కాబట్టి ఈ శాఖను మరొకరికి అప్పగిస్తే మంచిది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని మెరుగుపరిచే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే డ్రాప్ ఔట్స్ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఎమ్మెల్యే సూచించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సీనియర్ సభ్యుల సూచనలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రి-టైర్డ్ ఆఫీసర్ల సహాయంతో పాఠశాలల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు రాకేశ్ రెడ్డి. స్కూళ్లకు కాంపౌండ్ వాల్, శుభ్రమైన వసతులు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాల న్నారు. ఇకపోతే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు.

# తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

## మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు

**హైదరాబాద్,మార్చి25:** ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిం చారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహ 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.

# ఘటకేశ్వర్ రైల్వే బ్రిడ్జికి తొలగిన అడ్డంకులు

## 50లక్షలు మంజూరు చేసిన భట్టి



**తొలి సమయం హైదరాబాద్, మార్చి25:** మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చొరవతో ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనులకు నిధులు మంజూరయ్యాయి. అర్థాంతరంగా పనులు నిలిచిపోయి పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనుల నిమిత్తం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ. 50లక్షలను మంజూరు చేశారు. దీనిపట్ల ఘట్‌కేసర్ జేఏసీ, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ మంత్రి మల్లారెడ్డినికి కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో డిప్యూటీ- సీఎం భట్టివిక్రమార్కను మల్లారెడ్డి కలిసి సమస్యను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క.. రూ. 50 లక్షలను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు చేయడం పట్ల భట్టి విక్రమార్క, మల్లారెడ్డికి ఘట్‌కేసర్ జేఏసీ చైర్మన్ మారం లక్ష్మారెడ్డి, సభ్యులు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి మల్లారెడ్డి చొరవతోనే బ్రిడ్జ్ నిర్మాణం 80 శాతం పూర్తయిందని తెలిపారు.

# మొత్తం 35 సవరణలకు అనుమతి

## లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం



**న్యూఢిల్లీ,మార్చి25:** ఆన్ లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం ప్రక్రియ లోక్‌సభలో పూర్తయింది. ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం ప్రక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు- కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు-, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు-. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు- 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు- 4.8 శాతంగా అంచనావేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లు-గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడీపీ రూ. 3,24,11,406 కోట్లు-. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడీపీ 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

# హోంశాఖ నా ఫేవరేట్: కోమటిరెడ్డి

**తొలి సమమం హైదరాబాద్,మార్చి25:** మంత్రి పదవి వస్తదనే అనుకుంటున్నా... కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాజాగా మీడియా చిట్‌చాట్‌లో ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. భువనగిరి ఎంపీ బాధ్యతలు ఇస్తే.. సమర్థవంతంగా నిర్వహించానని గుర్తు చేశారు. తనకు హోంమంత్రి పదవి అంటే ఇష్టమన్నారు. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు.

# జమిలి ఎన్నికల జెపిసి గడువు పొడిగింపు

## లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం

**న్యూఢిల్లీ,మార్చి25:** 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని 2025 వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు పొడిగించే ప్రతిపాదనను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు 2024 , కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు- 2024 పై లోక్‌సభలో నివేదిక సమర్పించడానికి సమయాన్ని పొడిగించాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పిపి చౌదరి మంగళవారం ప్రతిపాదించారు. దీనిని సభ మూజువాణి ఓటు- ద్వారా ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై మోడీ ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బీజేపీ ఎంపీ, మాజీ న్యాయశాఖ మంత్రి పిపి చౌదరి అధ్యక్షతన 39 మంది సభ్యుల జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు- చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చుచ, సమయం ఆదా అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం అంగీకరించడం లేదు. తాజాగా జెపిసి చైర్మన్, భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపి పిపి చౌదరి గడువు హెచ్చింపు కోసం తీర్మానాన్ని లోక్‌సభలో ప్రతిపాదించారు. సభ మూజువాణి వోటుతో తీర్మానానికి ఆమోదం తెలిపింది. రాజ్యసభ నుంచి ఒక కొత్త సభ్యుని కమిటీ-లో చేరుస్తున్నట్లు- లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దావత్ -ఏ- ఇస్తార్



**తొలి సమయం రాయపర్తి మార్చి 25**
రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో మజీద్ ఏ మున్నిసా లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దావత్ -ఏ- ఇస్తార్ విందులో పాల్గొని, ముస్లిం సోదరులందరితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి,సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించిన రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాట్రపల్లి మజీద్ సదర్ సాహెబ్ యాకూబ్ మరియు హాఫీ సాహెబ్ తాకిబ్ కు నూతన వస్త్రాలు బహుకరించి, అభినందనలు తెలిపారు.రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం అని, 30 రోజులపాటు ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు,మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు, ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో మాజీ టీపిసిసి సెక్రెటరీ "బిల్లా సుధీర్ రెడ్డి తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హామ్యా నాయక్ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి పాలకుర్తి సోమనాధ ఆలయ డైరెక్టర్ పెండ్లి మహేందర్ రెడ్డి,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి అఫ్రోజ్ ఖాన్, మాజీ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి మహమూద్ ఎండి రియాజ్, ఎండి గౌస్, ఎండి ఫెరోజ్, హైమద్ షరీఫ్ యాకోబ్ పాషా, మరియు ముస్లిం సోదరులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

**ఆసరా పెన్షన్లు,కొత్త రేషన్ కార్డులు అర్హులైన అందరికీ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలి**

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్**




**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ దమ్మపేట మార్చి 25**
అర్హులైన వారందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని అర్హులైన అందరికి ఆసరా పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు, ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తాసిల్దార్ కి ఇవ్వడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము మాట్లాడుతూ దమ్మపేటలోని కాలనీలలో అనేక మంది నిరుపేదలకు ఉండటానికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక అనేక బాధలు పడుతున్న పట్టించుకునే నాధుడే లేదని ఏ పార్టీ అధికారంలో ఉన్న వారి సమస్యలు పరిష్కరించడం లేదనిఅన్నారు.

ఓట్లకు ముందు మీ సమస్యలు పరిష్కరిస్తామని ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మిస్తామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత మొఖం సాటేస్తున్నారని అన్నారు గత ప్రభుత్వం అందరికీ డబల్ బెడ్ డ్రుమ్ ఇండ్లు స్తామని చెప్పి పది సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికి ఇవ్వలేదని అన్నారు మల్లారం కాలనీలో నిరు ప్రయోగంగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్ల స్థలాలలో పేదల చేసుకున్న గుడిసెలను దుర్మార్గంగా తొలగించారని తొలగించిన వారికి ఈనాటికీ కూడా ఇళ్ల స్థలాలు చూపించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై ఉన్న ప్రేమ ఏంటో అర్థం అవుతుందని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రతి నిరుపేదకు ఉండటానికి ఇల్లు నిర్మించుకోవడానికి ఇడ్ల స్థలం, అందరికీ ఇందిర ఇండ్లు, ఇస్తామని చెప్పి అధికారం లో వచ్చి 15 నెలలు అయినప్పటికీ ఎక్కడ ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించిన దాఖలాలు లేవని అన్నారు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాటల గారడీతో కాకుండా అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు లేని వారికి స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, అర్హులైన అందరికీ ఆసరా పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గం మాటలతోటి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు తక్షణమే మండల రెవెన్యూ అధికారులు స్పందించి మండలంలో ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారి వద్ద నుండి స్వాధీనం చేసుకొని దమ్మపేటలో ఇళ్ల స్థలం లేని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేనియెడల సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకత్వాన ఇళ్ల స్థలాలు లేని పేదల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల నాయకులు పందూరి వీరబాబు, గంగాధర నాగమణి, దాసరి సుజాత, పి జగదీష్, నాగవల్లి,ఎం దుర్గాప్రసాద్, ఝాన్సీ,పి శివ భారతి, కే నాగమణి తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/టేకులపల్లి మార్చి 25**
టేకులపల్లి మండలం లో జరుగుతున్న పలు ఉపాధి హామీ కూలి పనులను స్వయంగా వెళ్ళి పరిశీలించిన కలెక్టర్.. కూలీలతో కలిసి పలుగు పార పట్టి కాసేపు మట్టి తవ్వి పోశారు.మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీ నందు జరుగుచున్న రైతు సమ్మయ్య ఫారం పాండు పనిని పరిశీలించి కూలీలతో పాటు సరదాగా సుమారు 45 నిమిషాలు పనిచేసినారు. మరియు పక్కనే జరుగుతున్న రహదారి నిర్మాణం పనిని పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు మరియు ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకోవాలని, ప్రతిరోజు ప్రతి కూలి 300 రూపాయలు కొలతల ప్రకారం పని చేసుకోవాలని ఎక్కువ గంటలు పని చేయాలని, మరియు ఎండాకాలం దృష్ట్యా ఉదయాన్నే ఉపాధి పనులకు హాజరయ్యి పని చేసుకోవాలని కూలీలకు తెలియజేశారు. రైతులు రాబోయే రోజులలో నీటి ఎద్దడి దృష్ట్యా అందరూ ఫారం పాండు నిర్మాణాలను పెద్ద ఎత్తున నిర్మించుకోవాలని, మరియు ఎక్కువ ఆదాయం వచ్చే మునగ పంటల సాగును చేపట్టాలని రైతులకు తెలియజేశారు. మరియు ముగ్గురు రైతులు యాదగిరి, రవి మరియు శ్రీను లు సాగు చేస్తున్న 6 ఎకరాల మునగ తోట సాగును పరిశీలించి రైతులతో మాట్లాడినారు. మరియు సంతృప్తి వ్యక్తం చేసినారు. అనంతరం ఎర్రాయి గూడెం గ్రామపంచాయతీ నందు ఉపాధి హామీ పథకంలో నూతనంగా నిర్మించిన రెండు పశువుల షెడ్లను గూగులత్ శాంతి మరియు బీమ్లు షెడ్ లను పరిశీలించి వీటిని పశువుల కొరకు సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆదేశించినారు.రైతులకు, అధికారులకు పలు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన , ఎంపీడీవో జి. రవీందర్, ఎంపీఓ గాంధీ మరియు ఏవో అన్నపూర్ణ, ఏపీవో శ్రీనివాస్ ఈసీ తిరుపతయ్య టిఏ ఈశ్వరి ఎఫ్ఏ లు కార్యదర్శిలు మరియు ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు గుల్ల

**హైదరాబాద్,మార్చి25:** మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల సోమేశ్ క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమేశ్ తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని తన కొడుకు సోమేశ్ తెల్లవారు 4గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తమ ఇంటి సమీపంలోని గౌడవెల్లిలో రైల్ ట్రాక్ పై పడుకొని ఆత్మహత్య చేసుకున్నడన్నారు. లక్షల్లో సోమేశ్ క్రికెట్ బెట్టింగ్ పెట్టాడని తెలిపారు. గతంలో తమ కూతురు వివాహం కోసం సోమేశ్ అప్పు చేశాడని అప్పు తీర్చామన్నారు. అందరితో బాగానే మాట్లాడాడని.. రాత్రి ఏం జరిగిందో? ఎవరు టార్చర్ చేశారో తెలియదన్నారు. మనోవేదనకు గురై సోమేశ్ సూసైడ్ చేసుకున్నాడని.. తమకు కడుపుకోత మిగిల్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన ఈ అన్యాయం ఎవరి కుటుంబంలో జరగకూడదని ఆ తల్లిదండ్రులు తెలిపారు. బెట్టింగ్ యాప్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సోమేశ్ చనిపోయే ముందు స్నేహితులకు వాట్సప్‌లో లొకేషన్ షేర్ చేశాడని.. తామంతా లొకేషన్ కి వెళ్లేసరికి మృతదేహం పడి ఉందని కన్నీరుమున్నీరుగా విలపించారు.

**యువతకు ఉద్యోగాలు కల్పించండి**

# చేతులకు సంకెళ్లు వద్దు

**ఢిల్లీ వీధుల్లో కదం తొక్కిన యూత్ కాంగ్రెస్ శ్రేణులు**

**పాల్గొన్న భద్రాద్రి జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మార్చి 25**
కొత్తగూడెం పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభాన్ని మరియు యువత ఎదుర్కొం టున్న పెరుగుతున్న సమస్యలను పరిష్కరించడానికి ఉద్యోగాలు కల్పించండి యువకుల చేతులకు సంకెళ్లు కాదనే నినాదంతో జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ భాను చిబ్, యువజన కాంగ్రెస్ జాతీయ ఇంచార్జ్ అల్లవారు కృష్ణ, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ తన బృందంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత ఎన్నికల్లో కేవలం దేవుళ్ళ పేరు చెప్పి కులాల మధ్య మతాల మధ్య గొడవలు పెట్టి గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాలు అడిగితే విద్యార్థుల చేతులకు సంకెళ్లు వేసి లక్షలాది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. ఈ కేంద్ర ప్రభుత్వ నియంత పాలనకు రాబోయే కాలంలో దేశ ప్రజలు కచ్చితంగా గుణపాఠం చెబుతారని అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను జాతీయ స్థాయిలో ఎత్తి చూపి, జవాబుదారీగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని దేశ ప్రజలకు తెలియచేసెందుకు నేడు వేలాది మంది యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీ వచ్చినట్లు ఆయన తెలిపారు. భారత యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ సమక్షంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

**చుంచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో**

**ఎమ్మెల్యే కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చుంచుపల్లి మార్చ్ 25**
కొత్తగూడెం చుంచుపల్లి మండల పరిధిలోని బాబుక్యాంపు సిపిఐ మండల పార్టీ కార్యాలయం రజబ్ అలీ భవనంలో చుంచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి సమక్షంలో కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముందుగా కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన సీఎం, సహచర మంత్రి బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో ఎంతో కృషి చేస్తున్నారని, దానిలో భాగంగా కార్పొరేషన్ ఏర్పాటు వల్ల అన్ని రంగాలలో అభివృద్ధి చెందటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందటంతో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని, గెలిచిన 15 నెలల కాలంలో కొత్తగూడెం నియోజకవర్గం రూపురేఖలు మార్చటానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ భద్రాద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గారాసి వెంకన్న, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు మాధవరావు, బాబు క్యాంప్ మాజీ ఉపసర్పంచ్ పొలామూరి శ్రీనివాస్, చుంచుపల్లి మండల కౌన్సిల్ మెంబెర్ ఎండీ బాబ్జి, క్రాంతి, ముషు, ఎన్ కె నగర్ మాజీ సర్పంచ్ రాంజీ, మాజీ ఉపసర్పంచ్ యాంద్ర మహేష్, తాళ్లూరి మధు, జేఎంఏ మురళి, రాంనగర్ మాజీ వార్డ్ మెంబెర్ కిట్టు, భాగం హనుమంతరావు, గాంధీ కాలనీ సిపిఐ నాయకుడు నగేష్, కాంగ్రెస్ నాయకులు బాబు, సిపిఐ మండల నాయకత్వం మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మద్యం ఆదాయం ఎలా పెంచారో తెలుసు

**వేముల ప్రశ్నలకు మంత్రి జూపల్లి సమాధానం**

**హైదరాబాద్,మార్చి25:** బెల్టు షాపులు పెంచిన ఘనత బిఆర్ఎస్ దేనని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళంవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులపై మంత్రి జూపల్లి మండిపడ్డారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అడిగిన మద్యం అమ్మకాలపై ప్రశ్నకు జూపల్లి సమాధానం ఇస్తూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ. 9,000 కోట్లు ఉన్న మద్యం ఆదాయాన్ని 2023 వరకు రూ. 34,000 కోట్లకు ఎలా పెంచిందో అందరికీ తెలుసన్నారు. చట్టవిరుద్ధంగా బెల్ట్ షాపులను పెంచి వాటి ద్వారా అక్రమంగా మద్యం అమ్మించారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం స్మగ్లింగ్ ఆపడానికి దాడులు చేస్తోందని, ఫామ్ హౌస్‌లలో మద్యం తాగడాన్ని నిషేధించిందని సమాధానమిచ్చారు. ప్రశాంత్ రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానం ఇస్తూ ఆర్ఆర్ఆర్ పనుల కోసం భూసేకరణ పనులకు అనుమతి వచ్చిందని, నిధుల విడుదలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని త్వరలోనే కలుస్తున్నామని చెప్పారు.

# అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలి

**- తెలంగాణ సమాజంలో అసభ్యతకు చోటు లేదు - మహిళల సాధికారతను ప్రోత్సహించండి**

**- భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్**




**తొలి సమయం వరంగల్ మార్చి 25**
భారతదేశ నైతిక విలువలు మరియు సాంస్కృతిక నైతికతను దిగజార్చే అసభ్యకరమైన అందాల పోటీలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలనీ భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేసారు. హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ 2025 అందాల పోటీలను నిర్వహించడాన్ని వ్యతరేకిస్తు, మహిళలను హానికరమైన వస్తురూపీకరణ మరియు సామ్రాజ్యవాద ప్రయోజనాలను ప్రోత్సహించే ఈ పోటీలను తక్షణమే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు హైదరాబాద్, హిమాయత్ నగర జంక్షన్ వద్ద మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రదర్శన నిర్వహించింది. అందాల పోటీలను రద్దు చేయాలనీ, మహిళల అభివృద్ధిని ప్రోత్సహించలని, మహిళా సాధికారతకు ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ సమాజంలో అసభ్యతకు చోటు లేదని, హైదరాబాద్ లో మిస్ వరల్డ్ అందాల పోటీని నిర్వహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించడాన్ని తీవ్రంగా ఖండించారు. అందాల పోటీలు స్త్రీ శరీర ప్రదర్శన తప్ప మరేమీ కాదని, సామ్రాజ్యవాద మార్కెట్ల విస్తరణను ప్రోత్సహించడానికి మరియు వాణిజ్య ఉత్పత్తులను విక్రయించడానికి రూపొందించబడ్డాయని అనే మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సృష్టికి పథకాలను ప్రవేశపెట్టడంలో, మహిళల భద్రతను నిర్ధారించడంలో లేదా మహిళలపై హింసాత్మక చర్యలపై తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని, ఇటువంటి అందాల పోటీలను నిర్వహించడం అనేది నిజమైన సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మాత్రమే ఉద్దేశించబడిందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి. ప్రేమపావని మాట్లాడుతూ మహిళల హానికరమైన వస్తురూపీకరణ మరియు సామ్రాజ్యవాద ప్రయోజనాలను ప్రోత్సహించే ఈ అందాల పోటీని హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన అవసరం లేదని, వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లో జరగబోయే అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలనీ లేనిపక్షం మే 7 నుండి 31 వరకు జరిగే ఈ అందాల పోటీలను అడుగడునా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైమీద, నాయకురాళ్లు ఎన్. కరుణ కుమారి,జ్యోతి శ్రీమాన్, షహానా అంజూమ్, రొయ్యల గిరిజ, ఏం. లక్ష్మి, కె. అరుణ వి. కమల ఏ. దేవమ్మ, సిహెచ్. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## కూలీలతో కలిసి ఉపాధి హామీ పనుల్లో

# పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**తొలిసమయం, ఇల్లందు మార్చి,25 :**
టేకులపల్లి మండలం లో జరుగుతున్న పలు ఉపాధి హామీ కూలి పనులను స్వయంగా వెళ్ళి పరిశీలించిన కలెక్టర్.. కూలీలతో కలిసి పలుగు పార పట్టి కాసేపు మట్టి తవ్వి పోశారు.మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీ నందు జరుగుచున్న రైతు సమ్మయ్య ఫారం పాండు పనిని పరిశీలించి కూలీలతో పాటు సరదాగా సుమారు 45 నిమిషాలు పనిచేసినారు. మరియు పక్కనే జరుగుతున్న రహదారి నిర్మాణం పనిని పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు మరియు ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకోవాలని, ప్రతిరోజు ప్రతి కూలి 300 రూపాయలు కొలతల ప్రకారం పని చేసుకోవాలని ఎక్కువ గంటలు పని చేయాలని, మరియు ఎండాకాలం దృష్ట్యా ఉదయాన్నే ఉపాధి పనులకు హాజరయ్యి పని చేసుకోవాలని కూలీలకు తెలియజేశారు. రైతులు రాబోయే రోజులలో నీటి ఎద్దడి దృష్ట్యా అందరూ ఫారం పాండు నిర్మాణాలను పెద్ద ఎత్తున నిర్మించుకోవాలని, మరియు ఎక్కువ ఆదాయం వచ్చే మునగ పంటల సాగును చేపట్టాలని రైతులకు తెలియజేశారు. మరియు ముగ్గురు రైతులు యాదగిరి, రవి మరియు శ్రీనులు సాగు చేస్తున్న 6 ఎకరాల మునగ తోట సాగును పరిశీలించి రైతులతో మాట్లాడినారు. మరియు సంతృప్తి వ్యక్తం చేసినారు. అనంతరం ఎర్రాయి గూడెం గ్రామపంచాయతీ నందు ఉపాధి హామీ పథకంలో నూతనంగా నిర్మించిన రెండు పశువుల షెడ్లను గూగులత్ శాంతి మరియు బీమ్ల షేడ్ లను పరిశీలించి వీటిని పశువుల కొరకు సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆదేశించినారు.రైతులకు, అధికారులకు పలు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన , ఎంపీడీవో జి. రవీందర్, ఎంపీఓ గాంధీ మరియు ఏవో అన్నపూర్ణ, ఏపీవో శ్రీనివాస్ ఈసీ తిరుపతయ్య టిఏ ఈశ్వరి ఎఫ్ఏ లు కార్యదర్శిలు మరియు ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్,(రేషన్ బియ్యం)

**- పట్టుకున్న జిల్లా అధికారులు,**

**- పట్టుబడిన బియ్యం 430క్వింటాల అంచనా - రేషన్ బియ్యం అక్రంగా తరలిస్తే కఠిన చర్యలు**



**తొలి సమయం, మహబూబాబాద్ మర్చి 25:**
మంగళవారం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్ లో పిడిఎస్ రేషన్ బియ్యం సుమారు 430, క్వింటాళ్లు అక్రమంగా తరలిస్తుండగా జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రేమ్ కుమార్, సంబంధిత సిబ్బంది కలిసి పట్టుకున్నారు. లబ్ధిదారుల నుండి అక్రమంగా కొనుగోలు చేసి వాటిని క్లీనింగ్ పాలిష్ చేసి వరంగల్ లోని సాయి లక్ష్మి రైస్ మిల్లు ద్వారా అమ్మకాలు జరుపుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు, జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరిగితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో నిఘా పెంచి ప్రతి మిల్లులను తనిఖీ చేయడం జరుగుతుందని ఎలాంటి అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు, రాజరాజేశ్వరి రైస్ మిల్లు మేనేజర్ గోవర్ధన్ రెడ్డి పై శాఖా పరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.ఈ తనిఖీల్లో డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ యువతను కాపాడుకుంటాం

**పాలకుర్తి ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**తొలి సమయం తొర్రూరు మార్చి 25**
పెద్దవంగర మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దవంగర మండలానికి చెందిన వివిధ గ్రామాల యువజన అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడం కోసం యువజన నాయకులు ప్రతి స్థాయిలో చురుకుగా పనిచేయాలి. ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సోషల్ మీడియా కోఆర్డినేటర్లపై ఉంటుంది. యువజన నాయకులు గ్రామ గ్రామన పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలి, నేటి యువతలే రేపటి పౌరులు, మీరందరు కలసి కట్టుగా పని చెయ్యండి, పార్టీ అభ్యున్నతికి పాటుపడండి. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను తక్షణమే సోషల్ మీడియా వేదికలపై ప్రచారం చేయాలి. ప్రతిపక్షాలకు దీటుగా సమాధానాలు ఇవ్వాలి, యువజన నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ లు రాబోయే తరానికి ఆదర్శం అని ప్రజలతో నేరుగా ఇంటరాక్షన్ చేయడం ద్వారా పార్టీ పట్ల విశ్వాసం పెంపొందించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, మండల యువజన అధ్యక్షులు హరి కృష్ణ, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సమ్మయ్య గౌడ్, వివిధ గ్రామ యువజన అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినెటర్లు, తదితరులు, పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో మృతదేహం

**తొలి సమయం తొర్రూరు మార్చ్ 25**



తొర్రూరు మండలంలోని మడిపల్లె శివారు గ్రామమైన సోమవారపు కుంట తండ సమీపంలో చీకటయ్యపాలెం కు చెందిన పాండవుల యాకన్న అనే వ్యక్తి రైతుల చేలుకల్లో అనుమాన స్థితిలో మృతదేహం లభ్యం స్థానికుల సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు స్థానిక పోలీస్ వారికి సమాచారం తెలియజేసినారు వారు వెంటనే మృతదేహం దగ్గరికి చేరుకోవడం జరిగింది పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది

## ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను కలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**రైతులకు వెంటనే నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి**

**పెండింగ్లో ఉన్న బిల్లులు మంజూరి చేయగలరు**



**తొలి సమయం తొర్రూరు మార్చి 25**
పాలకుర్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వం %దీ=ా% హయాంలో మంజూరు అయ్యి ఆగిపోయిన అభివృద్ధి పనులు కొనసాగించాలని అసెంబ్లీ కి వెళ్లి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క ను ఆయన ఛాంబార్ లో కలిసి పెండింగ్ లో ఉన్న పనుల వివరాలను తెలిపి వినతిపత్రం అందజేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. మరియు అలాగే ఇరిగేషన్ మినిస్టర్ ఛాంబర్ లో అక్కడి అధికారులను కలిసి రైతులు సాగు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారు అని ఇప్పటికే వేల ఎకరాలు ఎండిపోయాయని ఇప్పటికైనా స్పందించి రైతులకు సాగు నీళ్లు అందియాల్సందిగా కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

# గున్నె పల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్**



**తొలి సమయం దంతాలపల్లి మార్చి 25**
దంతాలపల్లి మండలం, గున్నె పల్లి గ్రామంలో డోర్నకల్ శాసనసభ్యుడు రామచంద్రనాయక్ సహకారంతో దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏఎంసి వైస్ చైర్మన్ బట్టు నాయక్, ఎంజీఎం ఆర్ఇజిఎస్ ద్వారా సిసి రోడ్ ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో గురుపాల్ రెడ్డి లింగారెడ్డి రాంరెడ్డి నెమ్మది యాకన్న ఎంపీటీసీ మధుకర్ రెడ్డి మహేందర్ రెడ్డి అశోకు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం పాలకుర్తి మార్చి 25**
పాలకుర్తి నియోజకవర్గంలో ఆర్డబ్ల్యూఎస్ (గ్రామీణ తాగునీటి సరఫరా) శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే , శాఖ పరిధిలో చేపట్టబడ్డ పనుల్లో రూ. 2 లక్షలకుపైగా విలువ ఉన్న పనులకు మాత్రమే టెక్నికల్ క్యూసీ పెట్టాలని, రూ. 2 లక్షలు లోపు పనులకు క్యూసీ పెట్టకూడదని మంత్రికి వినతిపత్రం అందజేశారు.ఎమ్మెల్యే విన్నపాన్ని మంత్రి సానుకూలంగా పరిగణించి, సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు హామీ ఇచ్చారు.ఈ చర్యల ద్వారా చిన్న స్థాయి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యే అవకాశముంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది.

# కానరాని ఆర్థిక పునరుత్తేజం !





**తొలి సమయం హైదరాబాద్,**
ఆర్థిక పునరుత్తేజం కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వేసుకున్న లెక్కలు తలకిందులు అయ్యాయి. క్షీణిస్తున్న రూపాయి విలువతో ఈ ఏడాది ఆసియాలోకెల్లా బాగా దెబ్బతిన్న కరెన్సీ ఇప్పుడు మనదేననడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, స్టాక్‌మార్కెట్ కష్టాలు సరేసరి. ఈ మధ్య అవి కూడా తలకిందులు అవుతున్నాయి. భారత్ ఇప్పుడు ఆర్థిక, వాణిజ్య లోటులు రెంటినీ ఎదుర్కొంటోంది. జాతీయ, అంతర్జాతీయ ధరలు పెరుగుతుండడంతో దేశంలో ద్రవ్యోల్బణంపై తన వైఖరిని భారత రిజర్వ్ బ్యాంక్ పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ధరలు ఇలానే పెరుగుతూ పోతే, వృద్ధిపై గట్టి దెబ్బ పడుతుంది. ఆర్బీఐ తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోకుండా చూడాలి. ప్రజల్లో ఆర్థిక లావాదేవీలు పెరగాలి. సత్వర కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజలకు పనులు కల్పించే పనులు చేయాలి.ప్రజల్లో రూపాయి చలామణి అయ్యేలా చేయాలి. ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ధాన్యం నిల్వలు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తే తప్ప ఆర్థిక రంగం బలపడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే దేశంలో ఆర్థిక విధానాలు నానాటికి దిగజారుతున్నాయి. కేవలం పన్నులు మీద ఉన్న శ్రద్ధ మరోదానిపై కనిపించడం లేదు. ప్రతిదీ పన్నుల కింద జమకట్టం, బ్యాంకుల వడ్డింపులు, వడ్డీల తీరు కారణంగా సామాన్యులకు జీవించడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉన్నది పన్నులు వసూలు చేయడానికి తప్ప ప్రజల కోసం కాదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రుజువు చేసుకున్నాయి. ఢిల్లీలో కూర్చుని లెక్కలు వేయకుండా ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలు వేస్తే ఆర్థిక పరిస్థితి ఏంటన్నది చూడాలి. బంగారం కొనడానికి లేదు. పుస్తెలు చేయించాలంటేనే భయపడే రోజులు దాపురించాయి. అదేపనిగా బంగారం,వెండిధరలు పెరిగి పోతున్నాయి. భూములు అందుబాటులో లేవు. అలాగే ఇళ్లు కట్టుకునే వీలు లేదు. ఆహార ధాన్యాలు కొనే ధైర్యం లేదు. తిండి తినడం కూడా భయంగా మారింది. బ్యాంకులు ఎగవేతదారులను వదిలి సామాన్యుల వెంట పడుతున్నాయి. ఇలా అన్ని విధాలా ధరలు పెరిగిపోతున్నా..పాలకులు పట్టించు కోవడం లేదు. సరికదా అభివృద్ధికి ఇదే సూచిక అని చంకలు గుద్దుకుంటున్నారు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు కూడా ప్రజల జీవనంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచమంతటినీ తాకుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా మనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్కడి సెగ ఇక్కడి మన స్టాక్ మార్కెట్లు, మదుపరులు, ఆర్థిక విధాన నిర్ణేతలు ఇలా ప్రతి ఒక్కరికీ తగులుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడనుంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్ల పతనం, ఎన్నడూ లేనట్టు డాలర్‌కు 85 రూపాయల స్థాయికి కరెన్సీ విలువ క్షీణించడం, పెరగనున్న చమురు ధరలు వెక్కిరిస్తున్నాయి. అనేక అవాంతరాల మధ్య క్రమంగా కోలుకుంటోందని భావిస్తున్న దేశ ఆర్థికరంగం రానున్న రోజుల్లో ఇంకెంత ఒత్తిడికి గురవుతుందోనని ఆందోళన కలుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతుండడం మన ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలు కానుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోతోంది. చమురుకు తోడు వంటనూనెలు ఉన్నాయి. ప్రపంచం లోసన్‌ఫ్లవర్ నూనెలో అయిదింట నాలుగొంతులు రష్యా, ఉక్రెయిన్‌ల ఉత్పత్తి కావడం గమనించాలి. మన సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతుల్లో 90 శాతం ఆ రెండు దేశాల నుంచే వస్తాయి. పామాయిల్, ఆవనూనెల ధరలు ఇప్పటికే పైకి చూస్తున్నాయి. మన దగ్గర ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా వాణిజ్య పరంగా వాటిని ఎగమతులు చేసుకునే వ్యూహాలు కానరావడం లేదు. పసుపు, మిర్చి,అల్లం, వెల్లుల్లి, బియ్యం, పత్తి వంటి వాణిజ్య పంటలను అత్యధికంగగా ఎగుమతి చేసుకునే విధానాలు రూపొందాలి. మన ఎగుమతులను సమీక్షించకుండా అదే పనిగా దిగుమతులు పెరిగితే ద్రవ్యోల్బణం పెరగడమే గాకుండా రూపాయి మారకవిలువ కూడా పెరగడం ఖాయం. వంటనూనెలు మరింత ప్రియం కానున్నాయి. కీలకమైన ఈ ఇంధనాల ధరలు ఇలా పెరిగిపోతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. ధరలు ప్రజల శక్తికి మించి పెరుగుతున్న చోట సామాజిక సంక్షోభం తలెత్తనుంది. నిత్యావసర సరకులు కొనుక్కోలేని అశక్తత ఏర్పడి అది అశాంతిని సృష్టించి వీధుల్లో అలజడికి కారణం అవుతుంది. ఈ కారణంగగా మన దేశీయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం తప్పనిసరి. అలాగే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా ఆర్థిక కార్యకలాపాలు సాగాలి. ఎగుమతులను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. అమ్మకాలతో లాభం లేదని గుర్తించాలి. ఇవేవీ చేయ కుండా ఎన్ని కసరత్తులు చేసినా లాభం లేదని గమనించాలి. ఆర్తిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకముందే పాలకులు మేల్కోవాలి. లేకుంటే పరిస్థితి సామాజిక సంక్షోభానికి దారితీయగలదని గుర్తించాలి. మనం పండిస్తున్న మిర్చి, పసుపు, పత్తి లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి. ఇక్కడి ఉత్పత్తులు ప్రజలకు చేరాలి. ప్రభుత్వం సరైన మార్కెంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గితే తప్ప రియల్ రంగం పుంజుకోదు. ఇవన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థికరరంగం గాడిన పడదు.

# జాతీయ జలవిధానంపై స్పష్టత రావాలి

## నదుల అనుసంధానం ఎజెండా కావాలి

**న్యూఢిల్లీ,మార్చి25:** వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతకు సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయరాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని మున్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌ల ను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. అలాగే కాళేశ్వరం పూర్తయితే తెలంగాణ కూడా సస్యశ్యామలం కాగలదు. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కటు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఆ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారినప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్ లో కౌంటర్ దాఖలు చేయడం ద్వారా కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసింది. ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. బ్రిజేష్ ట్రిబ్యునల్ అవలంబిస్తున్న ధోరణి, అది చేపట్టిన విచారణ మొదటి నుంచీ ఎగువ రాష్ట్రలకు అనుకూలంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా సాగింది. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి.

# పెట్రోల్, డీజిల్‌లను జిఎస్టీ పరిధిలోకి తేవాలి

**ఎక్సైజ్ సుంకాలు తగ్గించుకోవాల్సిందే**

**పన్నులపై ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి**

**న్యూఢిల్లీ,మార్చి25:** పన్నుల వ్యవస్థలో సహేతుకమైన మార్పులు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ జనాన్ని దోచుకోడం మానుకోకుంటే సమాజంలో అస్థిరతకు కారణం కాగలదు. పెట్రోల్, డీజెల్, వంటగ్యాస్‌పై పన్ను అక్కడికక్కడే చేతికి వచ్చి ఖజానాలను నింపుతాయి కాబట్టి వాటిని తగ్గించుకోడానికి పాలకులు వెనకాడుతున్నారు. అనుత్పాదక రంగాలకు అతిగా ఖర్చు పెట్టడం మానుకోవాలి. ఓట్లను రాబట్టే పథకాలను పక్కన పెట్టాలి. వస్తు, సేవల పన్ను నుంచి పెట్రోల్, డీజెల్‌ను మినహాయించడంలో ఆంతర్యం వాటి మీద తాము ఎప్పుడుబడితే అప్పుడు పన్నులను విధించి రాబడి పెంచుకోవాలన్న దురుద్దేశ్యం తప్ప మరోటి కానరాదు. ఇంధన ధరలను అదుపు చేయడంతో పాటు, సామాన్యులకు కూడా ధరలు అందుకునేలా ఉండాలి. పెట్రోట్, డీజెల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకోడం సరైన నిర్ణయంగా గుర్తించాలి. అదేపనిగా పన్నుల రూపంలో ప్రజలను దోచుకోవడం తగదని గుర్తించాలి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రజలపై భారాలు మోపడం సరికాదని పాలకులు గమనించాలి. పెట్రోలులపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గించుకుంటేనే ఆ మేరకు వీటి ధరలు తగ్గి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విధించే స్పెషల్ సుంకాలలో రాష్ట్రాలకు వాటా వుండదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తన ఆదాయానికి ఈ స్పెషల్ సుంకాల విధింపుపై ఆధారపడడం ఎక్కువైంది. ఇలాంటి సుంకాలతో భారం మోపే బదులు పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవడం మంచిది. కానీ తాజాగా ఎంపిల జీతభత్యాలను, పెన్షన్లు పెంచుకున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. పెట్రోల్ చిల్లర ధరలో 54 శాతం కేంద్ర, రాష్ట్రాలు విధించే పన్నుల కిందే పోతుంది. అలాగే డీజెల్ ధరలో 49 శాతం ఈ పన్నులే వుంటాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌పై ప్రతి లీటర్ వద్ద రూ. 32.9 మేరకు ఎక్సైజ్ సుంకాన్ని వసూలు చేస్తున్నది. అలాగే డీజెల్ మీద రూ. 31.8 తీసుకుం టున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్నులు ఇందుకు అదనంగా వుంటాయి. జిఎస్టీ పేరుతో ఇప్పటికే వాయింపులు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. నేలవిడిచి సాము చేసే పద్ధతిని విడనాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజెల్‌పై తాము వసూలు చేసే పన్నులను గణనీయంగా తగ్గించుకోగలిగితే ప్రజలపై భారం తగ్గి వాటిని సునాయాసంగా కొనుగోలు చేయగలుగుతారు. దేశంలో వినియోగిస్తున్న చమురులో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఓఎన్‌జిసి కష్టపడి శోధించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను పూర్తి స్థాయిలో వెలికి తీయకుండానే ఈ రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించారు. దానితో ప్రైవేటు కంపెనీలకు మేలు చేసిన వారు అవుతున్నారు. ఈ లెక్కన త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజెల్ ధరలు కనీసంగా రూ.115 లకు చేరే ప్రమాదమున్నది. ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను పక్కన పెట్టి ప్రజలను పన్నుల భారం నుంచి తప్పించాలి. దుబారా తగ్గించుకోవడం చేయాలి.

# దిగుమతులపై ఆధారపడితే ముప్పే

**న్యూఢిల్లీ,మార్చి25:**
ప్రపంచ సరకుల మార్కెట్లలో రష్యాది ప్రధాన పాత్ర కావడంతో అక్కడి కుదుపులన్నీ మనపై ప్రభావం చూపక మానవు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సహజవాయు ఎగుమతిదారు రష్యా. రెండో అతి పెద్ద చమురు ఎగుమతిదారూ ఆ దేశమే. ఆ దేశ జీడీపీలో అయిదోవంతు వీటి పుణ్యమే. ప్రపంచ చమురు దిగుమతుల్లో 12 శాతం రష్యా నుంచే వస్తాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుంచి ముడి చమురు ఫ్యూచర్లు 26 శాతం పైగా పెరిగాయి. గత డిసెంబర్‌లో బ్యారల్ 70 డాలర్లున్న అంతర్జాతీయ ముడి చమురు ధర ఇప్పుడు దాదాపు రెట్టింపు అయింది. చమురు అవసరాల్లో 85 శాతానికి దిగుమతులపైనే ఆధారపడ్డ దేశం మనది. ఇప్పుడిక ముడిచమురు దిగుమతి ఖర్చు భారీగా పెరుగుతుంది. చమురు కోసం రష్యాపై ఆధారపడ్డ పాశ్చాత్య దేశాలు తంటాలు పడుతున్నాయి. చమురు ధరల కారణంగా పెరిగే ఆ ఖర్చు ప్రభావం సరకుల రవాణా మీద పడుతుంది. సరకుల రేట్లకు రెక్కలొస్తాయి. ఆహార ధరలు పెరుగుతాయి. గోధుమలు, మొక్కజొన్న, బార్లీ ప్రపంచ ఎగుమతుల్లోనూ రష్యా, ఉక్రెయిన్లది గణనీయమైన పాత్ర. వాటి రేట్లూ పెరుగుతున్నాయి. మన ఎరువుల దిగుమతుల్లో దాదాపు 17 శాతం పొటాష్, 60 శాతం ఎన్పీకే ఎరువులు రష్యావే. ఈ క్రమంలో దిగుమతులపై ఆధారపడ్డ మనం ధరల దాడిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

# మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

**ప్రమాదంలో గాయపడ్డ యువతి**

**హైదరాబాద్,మార్చి25:** హైదరాబాద్‌లోని బాలనగర్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసు సంచలనం రేపింది. మద్యం మత్తులో ఓ యువకుడు ఫార్చునర్ కారుతో యువతిని బలంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో 19 ఏళ్ల యువతి సాయి కీర్తి తీవ్రంగా గాయపడింది. మంగళవారం ఉదయం బాలనగర్ ఐడీపీఎల్ చౌరస్తాలో ఈ ఘటన జరిగింది. ఫార్చునర్ కారులో అతివేగంగా ప్రయాణిస్తున్న యువకుడు మద్యం మత్తులో ఉండటంతో అదుపుతప్పి రోడ్డుపై నడుస్తున్న సాయి కీర్తిని ఢీకొట్టాడు. అయితే, ఆక్సిడెంట్ చేసిన వెంటనే కారు ఆపకుండా అక్కడి నుంచి పరుగుతీశాడు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు నేరుగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని ఫతేనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతడిని బల్కంపేట్‌కు చెందిన గొగం అనిల్‌గా గుర్తించారు. దర్యాప్తులో అనిల్ తన స్నేహితులతో కలిసి మొయినాబాద్‌లోని ఓ ఫాం హౌస్‌లో పార్టీ చేసుకున్నట్లు- పోలీసులు వెల్లడించారు. పార్టీ అనంతరం మద్యం మత్తులోనే కారును నడిపాడు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101